క్లుప్తంగా

రూ.కోటితో గ్రామ దేవత ఆలయ నిర్మాణం



బూరగాంలో నిర్మిస్తున్న జడ్డమ్మ గ్రామదేవత ఆలయం

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామంలో రూ.కోటితో జడ్డమ్మ గ్రామ దేవత ఆలయాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సర్పంచ్ బిజిలి పుల్లాయ్ సోమవారం తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో స్వరాంగ సుందరంగా ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.

అన్నసమారాధన



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని అక్కులపేట-వేణమ్మపేట గ్రామంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు స్వామి వారికి చక్రతీర్థస్నానం, విశేష పూజలు నిర్వహించారు. అన్నదానంలో మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఉమారామలింగేశ్వర స్వామి తిరువీధి



తిరువీధిలో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని మండలంలోని బోరుభద్ర గ్రామంలో ఉమారాలింగేశ్వర స్వామి తిరువీధిని గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఎమ్మెల్సీల ఎంపికలో సామాజిక న్యాయం



రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటాల నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నికలకు సంబంధించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సామాజిక న్యాయం, సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి నర్తు రామారావు, విజయనగరం జిల్లా నుంచి పెనుమత్స సూర్యనారాయణ (సురేష్ రాజు)లను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించటంతో వారికి అభినందనలు తెలిపారు. నర్తు సేవలకు తగిన గుర్తింపు వచ్చిందన్నారు. బీసీలకు 11, ఓసీలకు 4, ఎస్సీలకు 2, ఎస్టీలకు ఒకటి ఎమ్మెల్సీలు ఇచ్చి ఆయా కులాలకు తగిన ప్రాధాన్యం కల్పించారన్నారు.

92 మందికి కంటి పరీక్షలు

కొత్తూరు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 92 మందికి కొత్తూరు సీహెచ్‌సీకి చెందిన ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకి రామయ్య కంటి పరీక్షలు చేశారు. 27 మందికి అంతర కుసుములు ఉన్నట్లు గుర్తించారు. వారికి శ్రీకాకుళం రిమ్స్‌లో శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు.

సుధాకర్‌కు మద్దతు ఇవ్వాలి

కొత్తూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కోరారు. కొత్తూరులోని తన కార్యాలయంలో పట్టభద్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సుధాకర్‌కు రాజకీయంగా అపారమైన అనుభవం ఉందన్నారు. పట్టభద్రులకు న్యాయం జరగాలంటే సుధాకర్‌ను గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మాజీ సర్పంచ్ లోతగెడ్డ తాతబాబు, ధర్మారావు, ఇందిరరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహసారథుల సమావేశం

పోలాకి: మండల వైఎస్సార్‌సీపీ గృహసారథుల సమావేశం చల్లబంద జంక్షన్ సమీపంలోని కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు తెలిపారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తోపాటు మండల ముఖ్యనాయకులు పాల్గొంటారన్నారు. 23 సచివాలయాల పరిధిలోని గృహసారథులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

భక్తజన పరవశం



ఉత్సవమూర్తులకు దండం పెట్టుకుంటున్న యువతి

వంశధార నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- వైభవంగా చక్రతీర్థ స్నానాలు
- వంశధార తీరంలో భక్తుల సందడి
- దారులన్నీ శ్రీముఖలింగం వైపే
- ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ రాధిక



పూజలు అందుకుంటున్న శ్రీముఖలింగేశ్వరస్వామి

మహా'శివ' సైకతం



శ్రీముఖలింగేశ్వరస్వామి చక్ర తీర్థ స్నానాల ఘట్టానికి వచ్చే భక్తుల మనోభావాలకు అనుగుణంగా లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి తరణి ప్రసాద్ మిశ్రా వంశధార తీరంలో మహా'శివ' సైకత శిల్పం వేశారు. భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంది. భక్తులు పసుపు, కుంకుమ, పూలు వేసి పూజలను నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

–ఎల్.ఎన్.పేట



నదిలో పూజలు చేస్తున్న మహిళలు



నదిలో వంటలు వండుకొని భోజనాలు చేస్తున్న భక్తులు



నదిలో పిరమిడ్ విన్యాసం చేస్తున్న యువకులు



మిరియాపల్లి వద్ద చక్రతీర్థ స్నానాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక



కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలోని (కృష్ణాపురం) శివాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



స్వర్గస్తులైన కుటుంబ సభ్యుల పేరిట జంగమయ్య పొగడ్తలు



నదిలో శివ లింగాన్ని తయారు చేస్తున్న చిన్నారులు



లుకలాంలో స్నాన్నాలు చేసి కామేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



సారవకోటలోని శివరామ పాత్రుని కోనేరులో చక్రతీర్థ స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



నదిలో కబడ్డీ ఆడుతున్న మహిళలు

జలుమూరు/ఎల్.ఎన్.పేట: జలుమూరు మండలంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి చక్రతీర్థ (త్రిశూల) స్నానాల సందర్భంగా సోమవారం వంశధార నదీ తీరంలో భక్తులు, యాత్రీకులు సందడి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యక పర్యవేక్షణ చేపట్టారు. యువకుల కేరింతలు కొట్టారు. భక్తులు భక్తిభావాలు చాటుకున్నారు. స్వర్గస్తులైన పెద్దలను జంగాలతో పొగిడించే కుటుంబ సభ్యులతో నదీ తీరం జనంతో నిండింది. సుధూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చి నదీ తీరంలో వంటావార్పులు చేశారు. శ్రీముఖలింగానికి వెళ్లే దారులన్నీ జన సంద్రంగా మారాయి. ఉదయం 9 గంటలకే నదిలోకి చేరుకున్న భక్తులు చక్రతీర్థ స్నానాలు కోసం సుమారు ఒంటి గంట వరకు వేచి ఉన్నారు. మిరియాపల్లి రేవులో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి శివ పార్వతులు, గంగాదేవికి పూజలు చేశారు.

చిన్నకోరాడలో

హిరమండలం: మండలంలోని చిన్నకోరాడలో గల స్వయంభూ ఉమారుద్రకోటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు సోమవారం చక్రతీర్థస్నానాలు నిర్వహించారు. అమావాస్య పాఢ్యమి సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తోనంగి తాడు, సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఏటా మహాశివారాత్రి ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆయవాయితీగా వస్తోంది. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూజల్లో పాల్గున్నారు. ఉత్సవ మూర్తులను తిరివీధి నిర్వహించి సమీపంలో ఉన్న వంశధారనదీ తీరంలో చక్రతీర్థస్నానాలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దుర్బలాపురం గ్రామంలోని బాలత్రిపుర సుందరి సహిత కామేశ్వరి స్వామివారికి చక్రతీర్థస్నానాలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మెట్టూరు బిట్-1లో

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1లోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన పంచామృత స్నానాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి బూర్లె శ్రీనివాసరావు, కృష్ణారావు సౌజన్యంతో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే కుంటిభద్రలోని మల్లికార్జున స్వామికి గ్రామస్తులు చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే వితరణ..

మెట్టూరు బిట్-1లో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి రూ.10వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యేకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

లుకలాంలో..

నరసన్నపేట: లుకలాం వద్ద గల వంశధార నదీతీరంలో త్రిశూల సహిత ఉమాకామేశ్వరి స్వామి చక్రతీర్థ స్నాన్నాలు సోమవారం నిర్వహించారు. కామేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తలు కన్నేపల్లి కామేశ్వరరావు, సీతారామమూర్తి, సత్యనారాయణ, రామారావు, కన్నేపల్లి ప్రసాద్ ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం చక్రతీర్థ స్నాన్నాలు ప్రారంభించారు. నదీ తీరాన యాత్ర నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సారవకోటలో..

సారవకోట: మండల కేంద్రంలోని మండలాధీశ్వర స్వామి వారి చక్రతీర్థ స్నానాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను స్థానిక శివరామపాత్రుని కోనేరులో చక్రతీర్థ స్నానాలు చేపట్టారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. అంగూరులోని కుంటేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను అంగూరు, అడ్డపనస, జోనంకిలో తిరువీధి నిర్వహించి అనంతరం ఆలయ సమీపంలో ఉన్న కోనేరులో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు.



లుకలాం వద్ద వంశధార నదీతీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సంప్రదాయం పాటించలేదు

- మండిపడిన లుకలాపు కుటుంబీకులు

ఎల్.ఎన్.పేట: శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాల ఘట్టంలో ఆలయ అధికారులు, పూజారులు, పోలీసులు సంప్రదాయాన్ని పాటించలేదని మిరియాపల్లి గ్రామానికి చెందిన లుకలాపు (నాయుడు) కుటుంబీకులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధీర్, అనందరావు, లక్ష్మునాయుడుతో పాటు పలువురు ఆరోపించారు. సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మిరియాపల్లి రేవులో జరిగిన చక్రతీర్థ స్నానాల్లో తమకు అవకాశం కల్పించలేదన్నారు. పూర్వీకుల నుంచి శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలకు లుకలాపు కుటుంబీకులే పూజలు నిర్వహిస్తూ వస్తున్నారన్నారు. ఈ ఏడాది పూజలు నిర్వహించేందుకు తమ కుటుంబానికి అనుమతి ఇవ్వకుండా ఆలయ అర్చకులే చేయడం సంప్రదాయానికి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లుకలాపు రమేష్, లుకలాపు రాజారావు, లుకలాపు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లుకలాపు కుటుంబీకులు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజమే లక్ష్యంగా గ్రామస్థాయి కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో తొగరాం గ్రామంలో గల స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బెలమాం పంచాయతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకుని పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన తరువాత గ్రామాలు అభివృద్ధి బాటలో నడిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీరు, గ్రామాల్లో రోడ్డు నిర్మాణాలు, మురుగు కాలువలు, నాడు-నేడు పథకంతో పాఠశాలలు అభివృద్ధి, ఆర్‌బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు వంటివి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని గుర్తుచేశారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కణుగుల కిశోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

24న వైద్య శిబిరం

పొందూరు: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న పట్టుశాలీ కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశరావు సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగులకు ప్రభుత్వం సరఫరా చేసిన వివిధ రకాల ఉపకరణాలను ఎంఈఓ కె.రాంబాబు సోమవారం పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో వివిధ కేటగిరీలకు సంబంధించి సుమారు 120 మంది దివ్యాంగ విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారికి మానసిక, శారీర వికాసానికి భవిత కేంద్రం ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. దశల వారీగా వివిధ రకాల ఉపకరణాలు, ఉపకారవేతనాలు వంటివి అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 9 మంది దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు సీతంనాయుడు, సీఆర్పీలు ధనుంజయరావు, కె.చంద్రరావు, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును గెలిపించాలి



నరసన్నపేట టౌన్ ఓటర్ల జాబితాను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయానికి కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై స్థానిక నాయకులతో సమీక్ష చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నామన్నారు. నరసన్నపేట టౌన్ బాధ్యతలను సదాశివుని కృష్ణ, సాసుపల్లి కృష్ణబాబుకు, రూరల్ బాధ్యతలను బొబ్బాది ఈశ్వరరావుతోపాటు మరికొంత మందికి అప్పగించారు. మిగిలిన ప్రధాన నాయకులు అందరూ గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించాలన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ నాయకులు తంగుడు జోగారావు, పాగోటి రాజారావు, గనగళ్ల శ్రీను, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

సుధాకర్ విజయానికి కృషిచేయాలి



ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాపై అవగాహన కల్పిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ పిలుపునిచ్చారు. మండలంలోని తొగరాం గ్రామంలో గల స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో పార్టీ మండల కో ఆర్డినేటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాలు, మున్సిపాల్టీకి సంబంధించిన ఓటర్ల జాబితాపై అవగాహన కల్పించారు. పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని, అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేసి, ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు.